నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
బుధవారం 12 జూన్ 2024 పేజీలు 8
గుంటూరు పల్నాడు

## ప్రజలతో శభాష్ అనిపించుకునేలా
# పాలన చేద్దాం..



- ఈ విజయం ప్రతీకారం కోసం కాదు... అభివృద్ధి, సంక్షేమం కోసం
- ప్రణాళికబద్ధంగా నియోజకవర్గాల సమస్యలను పరిష్కరిద్దాం
- ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి
- వ్యక్తిగత విమర్శలు పూర్తిగా నిరోధించాలి
- జనసేన పార్టీ శాసనసభ పక్ష నేతగా పవన్ కళ్యాణ్. ఏకగ్రీవ ఎన్నిక

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

'ప్రజలు అందించిన ఈ ఘన విజయం కక్ష సాధింపు రాజకీయాల కోసం కాదు. పగ, ప్రతీకారాలు తీర్చుకోవడానికి అంతకంటే కాదు. అని జనసేన పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన మంగళవారం పవన్ కళ్యాణ్ మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు మనల్ని మనస్ఫూర్తిగా నమ్మి అఖండ విజయాన్ని అందించారంటే వారికి అత్యుత్తమ పాలన ఇవ్వాలని చెప్పడమే. నేను ఎప్పుడూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని తప్పి ప్రవర్తించలేదు. అన్నారు.గత ప్రభుత్వానికి ఇది అర్థం కాలేదు. ఇప్పుడు అధికారంలో ప్రజాస్వామ్యాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించే బాధ్యతను తీసుకుంటామ'ని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం ఉదయం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన పార్టీ శాసనసభ పక్ష మొదటి సమావేశం

మిగతా 3వ పేజీలో









## చంద్రబాబు ప్రమాణస్వీకారం తర్వాత పెమ్మసాని బాధ్యతలు స్వీకారం

### కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి మంత్రులను కలిసిన పెమ్మసాని

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

'ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం కేంద్ర సహాయ మంత్రిగా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకుంటాను.' అని గ్రామీణ అభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

మిగతా 3వ పేజీలో



## ఏపీలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణంపై అధ్యయనం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

కూటమి కీలక హామీ అయిన మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పథకం అమలుపై కసరత్తు జరుగుతోంది. దీనికి సంబంధించి ఏపీఎస్ ఆర్టీసీ అధికారుల బృందం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం చేసింది. వీటిలో ఏది మన రాష్ట్రంలో అమలుకు వీలవుతుందనే అంశాన్ని పరిశీలించి ప్రాథమికంగా ఓ నివేదికనూ సిద్ధం చేశారు. దీని ప్రకారం.. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పథకానికి తెలంగాణ అనుసరిస్తున్న విధానమే మన రాష్ట్రానికి సరిపోతుందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడి మాదిరిగానే మన రాష్ట్రంలో కూడా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. అలాగే విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో సిటీ ఆర్డినరీ, మెట్రో

మిగతా 3వ పేజీలో

- కూటమి ప్రభుత్వ హామీపై పరిశీలన
- కర్ణాటక, తెలంగాణలో పరిశీలిస్తున్న అధికారులు
- సమగ్ర వివరాలతో నివేదిక తయారీ

# ఉద్యోగార్థుల భరోసా: నూతన ప్రభుత్వం...

**ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం యువత ధ్యేయం అన్నారు వివేకానంద. అలాంటి యువత నిర్వీర్య మయితే, పాలిత ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తే, దానికి నిదర్శనమే.. నేటి ఎన్నికల ఫలితం.... వాలెంటీర్ ఉద్యోగాలిచ్చేసాము, సచివా లయం ఉద్యోగాలు ఇచ్చేశాము...ఇక ఉద్యోగాల కల్పన అవసరం లేదనుకుంటే ... దాని నిదర్శనమే నేటి ఎన్నికల ఫలితం. ఐదు సంవత్సరాలు నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఎలక్షన్ కోడ్ కాలానికి హడావుడిగా ఎలా పడితే అలా, అరకొర నోటిఫికేషన్లు ఇచ్చి తాంబూలాలు ఇచ్చాం, తన్నుకు చావండి అన్నందుకే నేటి ఈ ఫలితం. ఎం.ఏ.,లు, ఎం.బి.ఏ.లు, ఎమ్.టెక్.,లు లాంటి పెద్దపెద్ద చదువులు చదివి ఐదువేల రూపాయల వాలంటీర్ జాబ్‌లో చేరి పడిన దుస్థితికే నేటి ఈ ఎన్నికల ఫలితం. బి.టెక్.,లు చేసి, పరిశ్రమలు లేక, రాక, తేక పొరుగు రాష్ట్రాలకు వలసవెళ్ళి కష్టాలను కన్నీళ్ళలో దాచుకున్న సగటు యువత పోటీపడి మరీ వేసిన ఓట్లకు సాక్ష్యమే ...ఈ ఎన్నికల ఫలితాలు.**

సహజంగానే యువత ఎమోషనల్‌గా ఉంటారు. జీవితంలో స్థిరపడి-స్థిరపడక ఇంట్లోవాళ్ళతో, బయటి వాళ్ళతో మాటలు పడుతూ ఎక్కడ ఏ చిన్న ఉద్యోగం దొరుకుతుందా అంటూ వెదుక్కుంటూ బిక్కుబిక్కుమని బతుకుతుంటారు. పాపం! ఒక రకమయిన భయం వారిని అనునిత్యం ఆవరించి ఉంటుంది. కానీ ఈలాంటి యువశక్తిని సవ్యదిశలో మలచగలిగితే ఒకదేశం లేదా ఒక రాష్ట్రాభివృద్ధి ఆకాశాన్నంటుతుంది. మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో లోపించినది సరిగ్గా ఇక్కడే. కనుక తెలంగాణాలో పదేళ్ళ పాలిత ప్రభుత్వాన్ని ఇంటికి పంపించారు. అలానే ఆంధ్రప్రదేశ్‌లో ఇది ఇప్పుడు జరిగింది. యువ ముఖ్యమంత్రి వర్యులు యువకుల గురించి ఎంతగా ఆలోచించాలి? 2050 యువతదే అన్న సత్యం అందరికీ తెలుసు. 2050 నాటికి ప్రపంచంలో ఏ దేశంలో లేని యువత మన దేశంలో ఉంటారు. వీళ్ళకు కావలసింది మందిరాలో, మసీదులో, చర్చిలో కాదు, సరైన ఉపాధి. గత ఐదేళ్ళలో ఉద్యోగాల కొరకు యువత వీధిబాట పడింది. పోరాటాలు చేసింది. దొరికిన ప్రజా ప్రతినిధులకెల్లా వినతిపత్రాలిచ్చింది. ఈ జర్నీలో విలువైన కాలం కరిగిపోయింది. కేసులపాలయింది. ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇవ్వండి అంటే బెదిరింపులు. అయ్యా కానిస్టేబుల్ ఉద్యోగాలు నింపండి అంటే ఉలుకూ లేదు పలుకూ లేదు. అయ్యా ఐదేళ్ళు అయిపోవస్తుందీ, చివరలో మీరు నోటిఫికేషన్లు ఇచ్చారు. ఈలోగా మా వయసు అయిపోయింది, ఏజ్ రిలాక్సేషన్ ఇవ్వండి అని వేడుకున్నప్పటికీ అవహేళనలు... వాలంటీర్ జాబ్‌లు ఇచ్చాంగా, సచివాలయాల జాబ్‌లు ఇచ్చాంగా అంటూ కనీసంలో కనీసం యువత పట్ల ఉండవలసిన స్పందనాలేదు, రెస్పెక్టూ లేదు.

పోరాడీ పోరాడీ అలసిపోయిన యువత కసితీరా గుద్దిన ఓట్లకు ఫలితమే నేటి ఎన్నికల రిజల్ట్స్. గ్రూప్-2 మెయిన్స్‌కి 1:100 కి మనం చేసిన ప్రయత్నానికి పరిగె సుధీర్‌గారు (ఏపీపీఎస్సీ మెంబరు) ఉండబట్టి, వారు వందకి వంద శాతం కృషి చేయబట్టి (తోటి మెంబర్లు వ్యతిరేకించినప్పటికీ) ఈ రోజున అర్హత సాధించి మెయిన్స్‌కి చదువుకోగల్గుతున్నారు. ఈ సందర్భంగా శ్రీ సుధీర్ గారికి మనం ఋణపడి ఉండాలి. అందుకే మీతో నేను చాలాసార్లు పంచుకున్నాను **'నాయకులు అనేవారు వారసత్వంగా కాదు, ప్రజల్లోంచి, ప్రజల సమస్యల్లోంచి పుట్టాలి, ప్రజలకి భరోసా ఇవ్వాలి, అంతకుమించి స్థిరమయిన జీవితం ఇవ్వాలి'.**

> **యువశక్తిని సవ్యదిశలో మలచగలిగితే ఒకదేశం లేదా ఒక రాష్ట్రాభివృద్ధి ఆకాశాన్నంటుతుంది. మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో లోపించినది సరిగ్గా ఇక్కడే. అందుకే తెలంగాణాలో పదేళ్ళ పాలిత ప్రభుత్వాన్ని ఇంటికి పంపించారు. అలానే ఆంధ్రప్రదేశ్‌లో ఇది ఇప్పుడు జరిగింది. నాయకులు యువత గురించి ఎంతగా ఆలోచించాలి..? 2050 నాటికి ప్రపంచంలో ఏ దేశంలో లేని యువత మన దేశంలో ఉంటారు. వీళ్ళకు కావలసింది మందిరాలో, మసీదులో, చర్చిలో కాదు, సరైన ఉపాధి.**



ప్రభుత్వ ఉద్యోగాలు తక్కువే. కాదనడం లేదు. పరిశ్రమలు తేవాలి. ఉన్న పరిశ్రమలను పోగొట్ట కూడదు. అనంతపురంలో 'కియా' కార్ల పరిశ్రమ వల్ల వేలాది మందికి ఉపాధి దొరికింది. అమర్ రాజా వెళ్ళి పోవడం వల్ల స్థానిక యువత ఉపాధి పోయింది. 'శ్రీ' సిటీలో కొద్దో గొప్పో ఉద్యోగాలు దొరుకుతున్నాయి. కానీ ఇవేవీ యువతకు చాలవు, మరిన్ని పరిశ్రమలు కావాలి, యువతకు ఉపాధి లభించాలి.

**నూతన ప్రభుత్వం తక్షణం చేయవలసినవి......**

నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు తమ తొలిసంతకం మెగా డి.ఎస్.సి. నోటిఫికేషన్ పైనే చేస్తాననడం, దానికి ప్రిఫరెన్స్ ఇవ్వడం యువత సంతోషించదగిన విషయం. డి.ఎడ్.,లు, బి.ఎడ్.,లు చేసి అస్సలు ఏమాత్రం చాలీచాలని జీతాలతో జీవితాలను ఈడ్చుకుంటూ వస్తున్న వేలాది డిఎస్సీ యువతకు ఇది ఊరటనిచ్చే విషయం. క్రమం తప్పకుండా మునుపటి లాగా డి.ఎస్సీ., నోటిఫికేషన్‌లు ఇవ్వాలి. ఇచ్చిన ఉద్యోగాలను సకాలంలో నింపాలి. ఐదేళ్ళ కాలం కళ్ళముందే కరిగిపోయినందుకు దానిని తిరిగి తీసుకొని రాలేము కదా!

రెండోది ఉద్యోగాల కేలండర్. యుపిఎస్సీలాగా ఇచ్చే ఉద్యోగాలు ఎన్నయినా సరే క్రమం తప్పకుండా కేలండర్‌లో పొందుపరుస్తూ దానిని జనవరిలో ప్రకటించి డిసెంబర్‌లోపు మాగ్జిమమ్ రిక్రూట్‌మెంట్‌లు పూర్తి చేసేయాలి. తమిళనాడు ప్రభుత్వం లాగా ముందుగానే జాబ్ కాలెండర్ ప్రకటించడం వల్ల ఉద్యోగార్థులకి ఒక ప్లాన్, ఒక వ్యూ ఉంటాయి. దానిని బట్టి వారు వ్యూహాలు మార్చుకుంటారు. ఎన్నాళ్ళ నుంచో నానుతున్న జాబ్ కాలెండర్‌కు నూతన ప్రభుత్వం జీవం పోయాలి.

మూడోది వాలంటీర్ వ్యవస్థ. నెలకు పదివేల రూపాయలు ఇస్తానని చంద్రబాబు ప్రకటించారు. అలానే వారి సేవలు తీసుకుంటూనే ఇంకా ఇంకా వారు ఆదాయ ఆర్జనకు మరిన్ని వేరే ఉపాధి మార్గాలను చూపాలి. ఈ విషయంలో బాబుగారికి ఒక దృష్టి ఉన్నట్లు తెలుస్తోంది.

నాలుగవది..పరుగెత్తుతోన్న ప్రపంచంతో పోటీ పడడానికి స్కిల్ బేస్డ్‌గా యువతని తీర్చిదిద్దాలి. అది ఇంతకుమునుపులా కాకుండా గ్రౌండ్ రియాలిటీని దృష్టిలో పెట్టుకొని చేయాలి. డిగ్రీ విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌ల పేరిట పచారీ షాపులకు పంపకుండా వారి స్కిల్‌కి ఉపయోగపడే పరిశ్రమలను ప్రోత్సహించాలి.

ఐదవది.. దేశంలో గుజరాత్ తరువాత సుదీర్ఘ సముద్రతీరం ఉన్నది ఆంధ్రప్రదేశ్‌లోనే. శరవేగంతో ఓడరేవుల నిర్మాణం, అంతకుమించి నిర్లక్ష్యానికి గురయిన టూరిజం పరిశ్రమను తట్టిలేపాలి. ఈ రెండు రంగాలలో వేలాది ఉద్యోగాలను యువతకు ఇవ్వవచ్చు.

ఆరవది, సాఫ్ట్‌వేర్ పరిశ్రమ. ఇది చంద్రబాబు గారికి కొట్టిన పిండి. వారి పుణ్యం వల్లే ఈ రోజున హైదరాబాద్ హైటెక్ సిటీ వేలాదిమంది టెక్కీలకు జీవనోపాధి అయింది. ఈ విషయంలో అనేక సాఫ్ట్‌వేర్ పరి శ్రమలను చంద్రబాబు అమరావతికి తేగలరు. ఆతెచ్చే ఆయురారోగ్యాలు చంద్రబాబుగారికి ఆ దేవుడు ఇవ్వాలని ప్రార్థిద్దాం. సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ వల్ల స్థానికంగానే యువతకు ఉపాధి దొరికి వలసలు వెళ్ళవలసిన అవసరం ఉండదు.

ఇలా మనం చెప్పుకుంటూపోతే చాలానే ఉన్నాయి. వన్ బై వన్ నూతన ప్రభుత్వం చేసుకుంటూ వెళుతుందని ఆశిద్దాం! శ్రీ చంద్రబాబునాయుడుగారు తమ పాలనలో యువతకు మరింత పెద్ద పీట వేసి ఉద్యోగాలు కల్పించి ఒక భరోసా జీవితాన్ని కల్పించాలని కోరుకుందాము. వివేకానందులవారి వాక్యం మరోసారి 'ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం' గల యువతను మరింతగా నూతనప్రభుత్వం ఉపయోగించు కోవాలని ఆశిస్తూ నూతన కూటమి ప్రభుత్వానికి బెస్ట్ విషెస్ చెపుదాము!



హిస్టరీ రఫీ సార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

## విద్య, ఉద్యోగ సమాచారం



**ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్...**

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలలో ఎన్‌డీఏ కూటమి పూర్తి మెజారిటీతో అధికారం సాధిస్తోంది. అధికారంలోకి వస్తే తొలి సంతకం మెగా డీఎస్సీ పైనే అని శ్రీకాళహస్తి ప్రజాగళంలో చంద్రబాబు నాయుడు ప్రకటించటంతో త్వరలో మెగా డీఎస్సీ ప్రకటించే అవకాశం ఉంది.

**ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ జులై 28న ...**

ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జులై 28వ తేదీన రెండు సెషన్లలో నిర్వహిస్తారు. గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులు పోస్టు, జోనల్, జిల్లా ప్రాధాన్యాలను కమిషన్ అధికారిక వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో జూన్ 18వ తేదీలోపు నమోదు చేయాలని ఏపీపీఎస్సీ కోరింది.

**తెలంగాణ టెట్ ఫలితాలు జూన్ 12న ..**

తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ 2024) పరీక్షలు మే 20వ తేదీన ప్రారంభమై, జూన్ 2 తో ముగిశాయి. రోజుకు రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ పరీక్షలలో పేపర్ 1 పరీక్షకు 86.03 శాతం మంది హాజరుకాగా పేపర్ 2 పరీక్షకు 82.58 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు సంబంధించిన ఆన్సర్ కీ, రెస్పాన్స్ షీట్లు విడుదల చేశారు. వీటిని అధికారిక వెబ్‌సైట్ https://tstet2024. aptonline.in/tstet ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఫలితాలు జూన్ 12న విడుదలయ్యే అవకాశం ఉంది. డీఎస్సీ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. ప్రభుత్వ టీచర్ పోస్టుల నియామకాలకు నిర్వహించే టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) రాసేందుకు టెట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాలి.

**త్వరలో ఏపీ టెట్ 2024 ఫలితాలు ...**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలు ఈ వారంలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన ప్రారంభమైన ఏపీ టెట్ 2024 పరీక్షలు మార్చి 9వ తేదీతో ముగిశాయి. ఇప్పటికే రెస్పాన్స్ షీట్లు, ఫైనల్ కీ విడుదలయ్యాయి. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 14వ తేదీనే ఏపీ టెట్ ఫలితాలు విడుదల కావాల్సి ఉంది. కానీ ఎన్నికల కోడ్ వల్ల వాయిదా పడ్డాయి.

**312 పోస్టుల భర్తీ కై యూపీఎస్సీ నోటిఫికేషన్...**

దేశ వ్యాప్తంగా ఉన్న పలు కేంద్ర విభాగాలు, పరిపాలన శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియలాజికల్ కెమిస్ట్, డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్, స్పెషలిస్ట్ గ్రేడ్-III అసిస్టెంట్ ప్రొఫెసర్, డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ వంటి తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 312 పోస్టులను భర్తీ చేయనున్నారు.

**అర్హతలు...**ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణతతో పాటు నోటిఫికేషన్‌లో సూచించిన విధంగా పని అనుభవం కూడా ఉండాలి.

**ఎంపిక విధానం..** రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**రిజిస్ట్రేషన్ ఫీజు...**

దరఖాస్తు సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజు కింద జనరల్ అభ్యర్థులు రూ.25 చెల్లించవల్సి ఉంటుంది. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు, దివ్యాంగ అభ్యర్థులు ఎలాంటి ఫీజు చెల్లించవల్సిన అవసరం లేదు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు జూన్ 13, 2024వ తేదీ తుది గడువు.

**పోస్టుల వివరాలు**

డిప్యూటీ సూపర్నెంట్ ఆర్కియలాజికల్ కెమిస్ట్ పోస్టులు: 4
డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ పోస్టులు: 67
సివిల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీసర్ పోస్టులు: 4
స్పెషలిస్ట్ గ్రేడ్-III అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు: 132
స్పెషలిస్ట్ గ్రేడ్-III పోస్టులు: 35
డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ పోస్టులు: 9
అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు: 4
అసిస్టెంట్ డైరెక్టర్ గ్రేడ్-II పోస్టులు: 46
ఇంజినీర్ & షిప్ సర్వేయర్ కం-డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పోస్టులు: 2
ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులు: 8
అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు: 1

# పెదకాకాని వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురి మృతి
- అలంకరణ పనికి వెళ్లివస్తూ.. అనంత లోకాలకు
- మిల్లర్‌ను ఢీకొన్న కారు, టాటా ఏస్ వాహనం





పెదకాకాని మేజర్ న్యూస్:అలంకరణ పనులకు వెళ్లి వస్తున్న కూలీలు కొద్ది సమయంలో ఇంటికి చేరేలోపు రోడ్డు ప్రమాదరూపంలో మృత్యువు కబళించింది. పెదకాకాని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, 9 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. సిమెంటు, కంకర కలిపే మిల్లర్‌ను ఐషర్ వాహనం వెనుక కట్టుకొని గుంటూరు వైపు తీసుకెళ్తోంది. పెదకాకాని అమెరికన్ ఆంకాలజీ క్యాన్సర్ ఆసుపత్రి ఎదుట ఉన్న జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి మరమ్మతులకు గురై రోడ్డు కుడివైపు నిలిచిపోయింది. ఆగి ఉన్న ఐషర్ వాహనాన్ని గమనించకపోవడంతో వెనుక నుంచి వచ్చిన కారు మిల్లర్‌ని బలంగా ఢీకొట్టింది. మిల్లర్ రోడ్డు మధ్యలోకి జరిగింది. ఇదే సమయంలో వెనుక వైపు నుంచి కూలీలతో వస్తున్న టాటా ఏస్ మినీ వాహనం మిల్లర్‌ని ఢీకొంది. భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో టాటా ఏస్‌లో ఉన్న పేరేచర్లకు చెందిన కె.రాంబాబు(40), గుంటూరు నగరానికి చెందిన తేజ (21) అక్కడికక్కడే మృతి చెందగా.. పాత గుంటూరుకు చెందిన డి.మధు (25) చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు ఐదుగురు క్షతగాత్రులకు వైద్య సేవలు అందిస్తున్నారు. కారులోని ముగ్గురు స్వల్పంగా గాయపడటంతో గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. టాటా ఏస్‌లో 9 మంది కూలీలు ఉదయం విజయవాడ వెళ్లి శుభకార్యం అలంకరణ పనిముగించుకొని ఇంటికి వస్తుండగా.. రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.

# ముఖ్యమంత్రి కూడా ఓ సాధారణ మనిషే. నారా చంద్రబాబు నాయుడు



దుగ్గిరాల, మేజర్ న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నాడ0 టే గతంలో మాదిరిగా చెట్లు కొట్టేయడం రోడ్లు మూసేయడం షాపులు బంద్ చేయడం పరదాలు కట్టుకోవడం ఉండవని, సీఎం కూడా మామూలు. మనిషేనని మామూలు మనిషిగానే జనంలోకి వస్తానని తెలుగుదేశం పార్టీ అధినేత ఉమ్మడి కూటమి నేత నారా చంద్రబాబు నాయుడు మంగళవారంసమావేశంలో అనడంతో రాష్ట్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా కోసం తప్ప, పెత్తనం కోసం కాదని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలు ఎన్నుకున్న నాయకులకు అహంకారం పనికిరాదని రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నాడ0. టే గతంలో మాదిరిగా ట్రాఫిక్ జామ్ చేయడం షాపులను మూసివేయడం ,పరదాలు కట్టుకోవడం. ఉండ వన్నారు .రాష్ట్ర ముఖ్యమంత్రి మామూలు. మనిషేనని మామూలుగానే జనంలోకివస్తాన.ని అనడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు .అందరితో కలిసి ఉంటానని, నాకోసం ట్రాఫిక్కును ఆపి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని అధికారులను ఆదేశించారని అనటంతో దుగ్గిరాల మండలంలోని ప్రజలు అభిమానులు నాయకులు కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజలతో శెభాష్ అనిపించుకునేలా పాలన చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. జనసేన శాసనసభ పక్ష నాయకుడుగా పవన్ కళ్యాణ్ ని పార్టీ తరఫున ఎన్నికైన ఎమ్మెల్యేలు అంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదట పవన్ కళ్యాణ్ పేరును పార్టీ పీఏసీ ఛైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించగా... సభ్యులంతా ఏకగ్రీవంగా బలపరిచారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "జనసేన పార్టీ విలువలను, స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడంలో పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలంతా పని చేయాలని కోరారు. పగలు, ప్రతీకారాలకు సమయం కాదు. దీనిని శ్రేణులకు కూడా అర్థమయ్యేలా నాయకులు తెలియజెప్పాలన్నారు.

**ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి**

ప్రజలు జనసేన పార్టీని నమ్మి పెద్ద బాధ్యతను ఇచ్చారు. దానిని సక్రమంగా నిర్వర్తించాలి. ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి. నాతో సహా పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలంతా దానిని బాధ్యతగా తీసుకుందాం. భారతదేశంలో ఎంతోమంది రాజకీయ పార్టీలను దశాబ్దంపాటు ఏ అధికారం లేకుండా నడిపిన దాఖలాలు లేవు. జనసేన పార్టీ ప్రయాణం ప్రజల ప్రేమ, అభిమానం, నమ్మకం అనే ఇంధనంతోనే నడిచింది. నేను ఢిల్లీ వెళ్లినప్పుడు చాలా మంది జాతీయ స్థాయి నాయకులు– ఇంతకాలం పాటు ఏ అధికారం లేకుండా పార్టీని ఎలా నడిపారని అడుగుతున్నారు. ఇది పూర్తిస్థాయిలో జన సైనికులు, వీర మహిళలు సాధించిన విజయం. ఈ స్ఫూర్తిని వారి నమ్మకాన్ని మరింత నిలబెట్టుకునేలా ఇకముందు కూడా మన ప్రయాణం ఉండాలి.

**నియోజకవర్గాల్లో ప్రాధాన్య అంశాలను గుర్తించండి**

పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలంతా మొదట నియోజకవర్గంలో కీలకమైన సమస్యలు, ప్రజల ఇబ్బందులు పడుతున్న విషయాలను గుర్తించాలి. ఏవి మొదట ప్రాధాన్య అంశాలో తెలుసుకోండి. వాటిని తీర్చేందుకు ప్రాధాన్యం ఇద్దాం. ఒక వేళ కేంద్రంతో ముడిపడిన అంశాలు ఉంటే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవి పూర్తయ్యేలా చొరవ తీసుకుందాం. పార్టీ తరఫున కూడా ప్రత్యేక కమిటీగా ఏర్పడి ప్రజల సమస్యలు తీర్చేందుకు సమన్వయం చేసుకుందాం. 2019 తర్వాత ప్రజలు అప్పటి ప్రభుత్వానికి ఎందుకు ఓటేశామా అనే ఆవేదనతో 2024లో మనకు గొప్ప విజయాన్ని అందించారు. వారి నమ్మకాన్ని, విశ్వాసాన్ని మరింత పెంచుకునేలా పనిచేయడం మనముందున్న బాధ్యత. పాలకొండ వెళ్లినప్పుడు అక్కడ పంట పొలాల్లోకి ఏనుగులు చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయని చెప్పారు. అలాగే రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చాలా తక్కువ నిధులు వెచ్చిస్తే పూర్తయ్యేవి ఉన్నాయి. అలాంటి సమస్యలను వెంటనే తీర్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ఈ ఎన్నికల్లో విద్య, వైద్యం, ఉపాధి, భద్రత, సాగు, తాగు నీరు కల్పిస్తామని ప్రజలకు పూర్తి స్థాయిలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాం. దానికి మన పార్టీ ఎమ్మెల్యేలు కట్టుబడి పని చేయాలి. ముఖ్యంగా గత ప్రభుత్వంలో శాంతి భద్రతలు అంతంత మాత్రంగానే ఉండేవి. ప్రజల భద్రతకు కూటమి ప్రభుత్వంలో పూర్తి స్థాయి భరోసా ఉంటుంది. రాజకీయాల్లో కొత్త తరం వచ్చి ఓటు వేసింది. యువతరం మనల్ని బలంగా నమ్మింది. ఎంతో నమ్మకంగా ఓటు వేసిన వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయకపోతే అంతే బలంగా నిలదీస్తారని గుర్తు పెట్టుకోండి. ప్రజలు కోపంతో ఒక్కోసారి మాట మాట్లాడినా దానిని వేరుగా తీసుకోవద్దు. వారి ఆగ్రహానికి కారణాలు ఏంటో వెతకండి. వాటిని పరిష్కరించేలా పనిచేయండి.

**విమర్శలు సహేతుకంగా ఉండాలి**

ప్రజాస్వామ్యంలో విమర్శలు సహేతుకంగా ఉండాలి. వ్యక్తిగతంగా అసలు మాట్లాడకండి. ఇతర రాజకీయ పార్టీల నేతలు వ్యక్తిగతంగా మాట్లాడినా.. దానిని మనం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొందాం. అంతేకానీ ఎదుటివారు మాట్లాడారని ఎట్టి పరిస్థితుల్లో పరిధి దాటి మాట్లాడొద్దు. వ్యక్తిగతంగా అసలు వెళ్లొద్దు. సమయపాలన పూర్తిస్థాయిలో పాటించాలి. ఓ ప్రణాళిక ప్రకారం పాలన ఉండాలి. పార్టీ పరిధి మేరకు కచ్చితంగా పనిచేయాలి. ఏ పాలసీ మీద అయినా అంతా కలిసి ఉమ్మడిగా కూర్చొని మాట్లాడుకొని నిర్ణయం తీసుకుందాం. ఐదేళ్ల పాలనకు ఓ ప్రణాళిక అనుసరించి ముందుకు వెళ్లాల్సిన అవసరం కచ్చితంగా ఉంది. ఎన్డీఏ పక్ష పార్టీలతో స్నేహంగా మెలగాలి. కలుపుగోలుగా క్షేత్రస్థాయిలోనూ అన్ని పార్టీలను కలుపుకొని వెళ్లాలి. ఇదే స్ఫూర్తిని ఐదేళ్లు కొనసాగించి ప్రజల మన్ననలు పొందేలా పని చేస్తారని ఆకాంక్షిస్తున్నాను" అన్నారు.

**పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధి...**

**రాష్ట్రం కోసం తపించిన విధానం మనల్ని గెలిపించాయి: నాదెండ్ల మనోహర్**

పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ అన్నారు ఆయన మాట్లాడుతూ... "చారిత్రక విజయం అందుకున్న ఈ తరుణంలో మొదటి శాసనసభ పక్ష సమావేశం జరుపుకోవడం ఆనందంగా ఉంది. పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధి... రాష్ట్రం కోసం తపించిన విధానం మనల్ని గెలిపించాయి. ఇంతటి గొప్ప విజయం అందుకున్న సమయంలో అంతే గర్వంతో అధ్యక్షుల నిర్ణయంలో ఆయనకు అండగా నిలబడాలి. ప్రజలు మన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అంతే చిత్తశుద్ధిగా పని చేయాలి. ఈ శుభతరుణంలో పార్టీ శాసనసభ పక్ష నాయకుడిగా పవన్ కళ్యాణ్ ని ఎన్నుకోవడం ఎంతో ఆనందం కలిగిస్తోంది" అన్నారు.

# ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రభంజనం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కాలేజీకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి అందరికంటే ముందు వరుసలో నిలిచారని విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జే.మోహన్‌రావు మాట్లాడుతూ వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలకు చెందిన ఐ . హనీత్ (387), టీ. సంజయ్ తేజ ( 494), ఏ. రోహన్ (904), సీ. రేవంత్ (957), పీ. అమర లోకేష్ (1015), పీ. గౌతమ్ ( 1195), కే.కారుణ్య ( 1206), ఎం. నాగ సాయి ప్రకాష్ ( 1219), బీ. యోగ విజయ్ కుమార్ ( 1369), సిహెచ్. వెంకట ఉదయ్ ఆదిత్య (1377), కే. దక్షిత్ (1777), ఎం. వివేక్ పూజిత్ కుమార్ (1964) ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధమైన విద్యాబోధన వల్లనే అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని వెల్లడించారు. 47 ఏళ్లకుపైగా అనుభవం, అవగాహనతో తాము విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకులతో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ విద్యాసంస్థల ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.మోహన్‌రావు, వై.వెంకటేశ్వర రావు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సిబ్బంది అభినందనలు తెలిపారు.

# చంద్రబాబు ప్రమాణస్వీకారం తర్వాత పెమ్మసాని బాధ్యతలు స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మరియు ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, కమ్యూనికేషన్స్ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియాను ఢిల్లీలో డాక్టర్ పెమ్మసాని విడివిడిగా మంగళవారం కలిశారు. తమను కలిసేందుకు వచ్చిన పెమ్మసానిని ఇరువురు కేంద్ర మంత్రులు ఆత్మీయంగా ఆహ్వానించారు. కేంద్ర మంత్రులకు పుష్పగుచ్ఛం ఇచ్చిన అనంతరం పెమ్మసాని శాలువాతో చిరు సత్కారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ ఇరువురు నాయకులను కలుసుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ సమస్యలపై త్వరలోనే పూర్తి వివరాలు అందజేస్తానని అలాగే గ్రామీణ అభివృద్ధితో పాటు కమ్యూనికేషన్స్, గుంటూరు పార్లమెంట్ పురోగతి దిశగా పని చేస్తానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బుధవారం జరగబోయే చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం తాను పూర్తిస్థాయిలో కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తానని ఈ సందర్భంగా కేంద్ర మంత్రులకు పెమ్మసాని వివరించారు. ఈ కార్యక్రమంలో పెమ్మసానితోపాటు ఆయన సతీమణి డాక్టర్ పెమ్మసాని శ్రీరత్న కూడా ఉన్నారు.

# ఏపీలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణంపై అధ్యయనం

(మొదటి పేజీ తరువాయి)

ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. కొత్త జిల్లాల పరిధిలోపే పరిమితి ఉంటుందా లేదా పాత ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉంటుందా? రాష్ట్రమంతా ఎక్కడికైనా ప్రయాణానికి అవకాశం ఇస్తారా అనే అంశాలు ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటాయి. తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు 'సున్నా' ఛార్జ్‌తో టికెట్ జారీ చేస్తారు. ఇలా జారీచేసిన టికెట్ల అసలు ఛార్జీ ఎంతో లెక్క కట్టి.. వాటిని రీయింబర్స్ చేసేలా ప్రభుత్వాన్ని ఆర్టీసీ కోరుతుంది.

**టికెట్ల ద్వారా నెలకు రూ.500 కోట్లు..**

ఏపీలో ప్రస్తుతం ఆర్టీసీకి టికెట్ల రూపంలో నెలకు రూ.500 కోట్లు వస్తున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే నెలకు సుమారు రూ.200 కోట్లు రాబడి తగ్గుతుందని అంచనా. మరోవైపు ఆర్టీసీ తన రాబడిలో నెలకు రూ. 125 కోట్లు ప్రభుత్వానికి ఇస్తోంది. పథకం అమలు చేస్తే ప్రభుత్వానికి చెల్లిస్తున్న రూ.125 కోట్లు నిలిపేయడంతో పాటు, మిగిలిన రూ.75 కోట్లను ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్‌గా తీసుకోవాల్సి ఉంటుందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. కొత్త ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, ఆదేశాలపైనే విధివిధానాలు ఆధారపడి ఉంటాయని తెలిపాయి.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదకాకాని మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన పెదకాకాని లోని వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరుకు చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి మృతి చెందాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జేకేసి కాలేజ్ వద్ద బైక్ మెకానిక్ గా పనిచేసే లక్ష్మీనారాయణ విజయవాడ కు చెందిన వారి బైక్ ను మరమ్మత్తులు చేసి వాహనాన్ని తిరిగి వారికి అందజేయడానికి స్నేహితు డి తో కలిసి విజయవాడ వెళ్లి బైకును అప్పజెప్పి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పెదకాకాని వై జంక్షన్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఫై ఓవర్ గోడను ఢీకొనడంతో వెనక కూర్చున్న లక్ష్మీనారాయణ హైవే ఫ్లైఓవర్ నుండి కింద సర్వీస్ రోడ్డులోకి జారిపడ్డాడు ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు.










# అమరావతే రాజధాని ఆర్థిక రాజధానిగా విశాఖ









- నా కుటుంబానికి ఎన్నో అవమానాలు జరిగాయి
- పదవి అనేది సేవకోసమే
- రాష్ట్రాన్ని పునర్ నిర్మించాల్సి ఉంది
- ప్రమాణ స్వీకారానికి విశిష్ట అతిథిగా చిరంజీవికి ఆహ్వానం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని తీర్పును ప్రజలు ఇచ్చారని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. తెదేపా-జనసేన-భాజపా కూటమి శాసనసభా పక్ష భేటీ విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. "ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజలు చొరవ చూపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. నూటికి నూరు శాతం 3 పార్టీల నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేశారు. ఎన్నికల్లో 93 శాతం సీట్లు గెలవడం దేశ చరిత్రలో అరుదు. ఎన్నికల్లో 57 శాతం ఓట్లతో ప్రజలు ఆశీర్వదించారు. ప్రజల తీర్పుతో మనందరిలో మరింత బాధ్యత పెరిగిందన్నారు.జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లోనూ గెలుపొందింది. భాజపా పోటీ చేసిన 10 స్థానాల్లో 8 సీట్లు గెలుచుకుంది. ప్రజలు ఇచ్చిన తీర్పు వల్ల దిల్లీలో అందరూ గౌరవించారు. ప్రజల తీర్పుతో రాష్ట్ర ప్రతిష్ఠ పెరిగింది. పవన్ కల్యాణ్ సమయస్ఫూర్తిని ఎప్పటికీ మరచిపోలేను. నేను జైలులో ఉన్నప్పుడు ఆయన వచ్చి పరామర్శించారు. తెదేపా, జనసేన పొత్తు పెట్టుకుంటున్నట్లు చెప్పారు. భాజపా, తెదేపా జనసేన కలిసి పోటీ చేస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పొత్తు పెట్టుకున్నాం. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా కలిసి పనిచేశాం' అన్నారు.

**రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర సహకారం అవసరం**

మీ అందరి సహకారంతో బుధవారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్నా. కార్యక్రమానికి ప్రధాని మోదీ, ఎన్డీయే నేతలు హాజరవుతున్నారు. సమష్టిగా ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర సహకారం అవసరం. రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తామని కేంద్ర నేతలు చెప్పారు"

**నా కుటుంబానికి ఎంతో అవమానం జరిగింది..**

ఓటర్లు ఇచ్చిన తీర్పు రాష్ట్ర చరిత్రలో నిలుస్తుంది. పదవి వచ్చిందని విర్రవీగితే ఇదే పరిస్థితి వస్తుంది. తప్పు చేసిన వారిని క్షమిస్తే అలవాటుగా మారుతుంది. తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష పడాల్సిన అవసరం ఉంది. విధ్వంస, కక్షా రాజకీయాలను ప్రక్షాళన చేయాలి. నా కుటుంబానికి అవమానం జరిగింది. గౌరవ సభ కాదు.. కౌరవ సభ అని చెప్పి బయటకు వచ్చా. ప్రజాక్షేత్రంలో గెలిచి గౌరవ సభగా చేసి అడుగుపెడతానని చెప్పా. నా శపథాన్ని ప్రజలు గౌరవించారు. గౌరవించిన ప్రజలను నిలబెట్టాలి. పోలవరం పనులు 72 శాతం పూర్తి చేశాం. డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం. నదులను అనుసంధానించి ప్రతి ఎకరానికి నీళ్లందిస్తాం"

**శిథిలమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిద్దాం**

14 ఏళ్లుగా సీఎంగా, 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నాను. ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని ముందుకెళ్లాం. ఏపీలో చాలా సమస్యలు ఉన్నాయి. రాష్ట్రం పూర్తిగా శిథిలమైంది. సంక్షోభంలో ఉంది. అన్ని వర్గాలు దెబ్బతిన్నాయి. రైతులు అప్పులపాలయ్యారు. పదేళ్ల తర్వాత రాజధాని ఏదంటే చెప్పుకోలేని పరిస్థితి. కక్షపూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మకంగా ముందుకు వెళ్లాలి. మూడు రాజధానులంటూ ఆటలాడే పరిస్థితి ఉండదు. అమరావతి రాజధానిగా ఉంటుంది. విశాఖను ఆర్థిక, ఆధునిక రాజధానిగా చేసుకుందాం. అని చంద్రబాబు చెప్పారు.

**సేవ కోసమే ఆ హోదా..**

సీఎం పర్యటనల సందర్భంగా షాపులు బంద్ చేయడం, రోడ్లు మూసేయడం, పరదాలు కట్టుకోవడం అవన్నీ ఉండవు. సీఎం కూడా మామూలు మనిషే. మామూలు మనిషిగానే వస్తా. మిత్రుడు పవన్‌తో పాటు మేమంతా సామాన్య వ్యక్తులుగానే మీ వద్దకు వస్తాం. మీలో ఒకరిగా ఉంటాం. హోదా సేవ కోసమే తప్ప.. పెత్తనం కోసం కాదు. కాన్వాయ్ వచ్చే సమయంలో ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దని చెప్పాం. ఒక సిగ్నల్‌కి మరో సిగ్నల్‌కి గ్యాప్ పెట్టుకోండి. ఐదు నిమిషాలు లేట్ అయినా పర్వాలేదు కానీ.. ప్రజలకు అసౌకర్యం కలగకూడదని స్పష్టంగా ఆదేశించాం. దాడులు చేసి బాధితులపైనే కేసులు పెట్టే పరిస్థితి ఉండదు. ఏ ఒక్కరి ఆత్మగౌరవానికీ భంగం కలగదు. ప్రజాహితం కోసమే పనిచేస్తాం. ప్రతి నిర్ణయం, ప్రతి అడుగు ప్రజల కోసమే ఉంటుంది. 'స్టేట్ ఫస్ట్' అనే నినాదంతో ముందుకెళ్తాం హరి చంద్రబాబు చెప్పారు.

**ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి..**

ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కూటమి నేతలు కలిశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ కూటమి ఎమ్మెల్యేల మద్దతు లేఖను అందజేశారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ గవర్నర్‌ను కలిశారు.









# పాతూరు శివాలయం వార్డును సందర్శించిన మున్సిపల్ కమిషనర్





నరసరావుపేటమేజర్ న్యూస్

నరసరావుపేట పురపాలక సంఘం పరిధి నందు మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్రారెడ్డి మార్నింగ్ విజిట్ లో భాగంగా 28 వ వార్డు పాతూరు శివాలయం బజారు మరియు వెంకటేశ్వర స్వామి గుడి పరిసర ప్రాంతాల నందు విజిట్ చేయడం జరిగినది. ఈ విజిట్ నందు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నాయక్ శానిటేషన్ ఇన్స్పెక్టర్లు రామకోటయ్య , వెంకటేశ్వర్లు మరియు వార్డు సచివాలయం సెక్రటరీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శివాలయం చుట్టు ప్రక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని వచ్చేటటువంటి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శానిటేషన్ అధికారులకు సూచించడం జరిగినది. అదేవిధంగా వెంకటేశ్వర స్వామి గుడి చుట్టూ ప్రక్కల ఉన్నటువంటి ఓపెన్ డ్రైయిన్స్ పై నాపరాళ్ళు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నాయక్ గారికి ఆదేశించడం జరిగినది. అదేవిధంగా 28 వార్డు మరియు శివాలయం చుట్టుపక్కల బిల్డింగ్ మెటీరియల్స్, రోడ్లపై బండలు రాళ్లు, బిల్డింగ్ నిర్మాణాలు చేసే కాలువలు పూడిఉండటం చూసి వాటన్నిటిని తొలగించుకోమని గతంలో చెప్పినా కూడా చేయకపోవడంతో సంబంధిత టౌన్ ప్లానింగ్ సెక్రటరీకి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జారీ చేయడం జరిగినది. అదేవిధంగా అవార్డు నందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సంబంధించి పైప్ లైన్ లైన్ కలెక్షన్స్ ఎన్ని అవసరము అదేవిధంగా కల్వర్టు లలో కాలువలు తీయడానికి మ్యాన్ హెూల్స్ ఏర్పాటు చేయమని గతంలో చెప్పిన కూడా చేయకుండా ఉండడం వలన సంబంధిత ఎమినిటి సెక్రటరీ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగినది.

## కరాటే పోటీలలో సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ



సత్తెనపల్లి, మేజర్‌న్యూస్: నరసరావుపేటలోని డిఎస్సి స్టేడియంలో డ్రాగన్స్ షుటోకాన్ కరాటేడు- ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే బెల్ట్ టెస్ట్ పోటీలలో సత్తనపల్లి విద్యార్థులు ప్రతిభ. కనబరిచారు.సత్తెనపల్లి లోని మార్కెట్ యార్డ్ లో జి రవి ఆధ్వర్యంలో ట్రైనింగ్ తీసుకుంటున్న 15 మంది విద్యార్థులు, విద్యార్థినిలు ఈ పోటీలో పాల్గొని విజయం సాధించారు..విజయం సాధించిన విద్యార్థులకు సంస్థ ఫౌండర్ పి.రాంబాబు సెవెంత్ డాన్, జి. సాయిరాం ఫిఫ్త్ డాన్ చేతులు మీదగా బెల్ట్,మెడల్స్ అందజేశారు.కాగా ఈ పోటీలకు వివిధ జిల్లాల నుండి 256 మంది బాల బాలికలు పాల్గొన్నారు.

## అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి



వినుకొండ, మేజర్‌న్యూస్: సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని గీతాంజలి హై స్కూల్లో 2023 - 2024 సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బి వర్షితకు స్కూల్ యాజమాన్యం ప్రోత్సాహక నగదు బహుమతిని మంగళవారం అందజేశారు.అత్యధిక మార్కులు సాధించిన వర్షిత తండ్రి శ్రీనివాసరావును దుస్సాలువా,పూలమాల,మెమొంటో తో సత్కరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు దుస్సాలువా మెమొంటోతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పి సుబ్బారావు,జి వి మాధవరావు,ఎం వి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## దాడి కేసులో వైకాపా నేతల అరెస్ట్

రెంటచింతల, మేజర్‌న్యూస్: గత నెల 12న తెదేపా పోలింగ్ ఏజెంట్లు సిద్దయ్య, మల్లయ్యలపై దాడికి పాల్పడిన ఘటన నిందితులైన వైకాపా నేతలను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం. ఆంజనేయులు తెలిపారు. ఉమామహేశ్వరరెడ్డి వెంకటరెడ్డి, సీతారామిరెడ్డి, మహేష్ రెడ్డి, రామయ్య, కోటేశ్వరరావు,బ్రహ్మారెడ్డి,శామ్యూల్,రామంజనేయ రెడ్డిలను మాచర్ల కోర్టులో హాజరుపరిచారు. వీరికి 14 రోజుల రిమాండ్ విధించారు. వెంటనే గుంటూరు సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

## వైసీపీ జండా దిమ్మెల్ని తొలగించండి: కొమ్మిశెట్టి

సత్తెనపల్లి, మేజర్‌న్యూస్: పట్టణంలో అనుమతుల్లేకుండా గత కొన్ని నెలల క్రితం వీధికొక వైసిపి జండా దిమ్మెని పబ్లిక్ స్థలాల్లో అక్రమంగా నిర్మించారు. అలా అనధికారికంగా, అనుమతుల్లేకుండా నిర్మించిన వైసిపి జండా దిమ్మెల్ని తక్షణమే చట్టప్రకారం తొలగించాలని కోరుతూ మున్సిపల్ కమీషనర్ కొలిమి షమ్మికి జనసేన పార్టీ తరపున కొమ్మిశెట్టి సాంబశివరావు ఫిర్యాదు చేశారు.



## నీటి నమూనాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

రెంటచింతల, మేజర్‌న్యూస్: రెంటచింతలలో అతిసారం నివారణకు వైద్య సేవలు కొనసాగుతున్నాయి స్థానిక పిహెచ్సి వైద్యులు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వడ్డెర బావి వీధిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 33 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. నర్సరావుపేట వైద్యాధికారి రాజారావు అధ్వర్యంలో పది చోట్ల నీటి “నములు సేకరించారు. గుంటూరు వైద్యశాలకు పరీక్షల నిమిత్తం పంపించారు. మురుగు కాల్వలలో ఉన్న మంచినీటి పైపులు తొలగించే వరకు మినరల్ వాటర్ తాగాలని,రెంటచింతలలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు గ్రామంలో దండోరా వేయించారు.



## ఇంగ్లాండ్ లో పల్నాడు జిల్లా యువకుడు మృతి

పల్నాడు జిల్లా క్రైమ్ మేజర్ న్యూస్



ఉన్నత చదువులు కోసం ఇంగ్లాండు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పల్నాడు పోలీసులు వివరాలు ప్రకారం పల్నాడు జిల్లా పెద కూరపాడు నియోజకవర్గం అచ్చంపేట మండలం కోనూరుకు చెందిన సాయిరాం (24) ఉన్నత చదువుల కోసం ఇంగ్లాండు వెళ్ళాడు అయితే ఈ నెల 2న మాంచెస్టర్ బీచ్ వద్ద సాయిరాం మృతదేహం ఇంగ్లాండ్ పోలీ సులు సాయిరాం మృతదేహం గా గుర్తించారు.వెంటనే మాంచెస్టర్ పోలీసులు పల్నాడు జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## కార్యకర్తల కష్టం మరువొద్దు

**- సత్తెనపల్లి టిడిపి నేతలకు కార్యకర్తల వినతి**

సత్తెనపల్లి, మేజర్‌న్యూస్

కష్ట కాలంలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి,ఎన్నికల్లో ప్రాణం పెట్టి పని చేసిన కార్యకర్తలను మరువొద్దని తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తున్నారు. మొన్నటి వరకు వైసిపి పార్టీలో క్రియాశీలకంగా ఉండి ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయం పాలైన వెంటనే తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్న కొందరు నేతలపై టిడిపి శ్రేణులు ఆగ్రహంగా ఉన్నారు.” చీమలు పెట్టిన పుట్టలోకి పాములు దూరుతున్నాయని, చీమల కష్టం మరువద్దని” ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పార్టీ విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలకు పెద్దపీట వేయాలని కోరుతున్నారు.అధికారం ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోయే వారిని పక్కన పెట్టాలని సూచిస్తున్నారు.

## ఆచార్య దేపూరు భారతికి సీహెచ్ సాంబయ్య స్మారక పురస్కారం



గుంటూరు (సాంస్కృతికం) మేజర్‌న్యూస్: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్, సిహెచ్. సాంబయ్య స్మారక పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో 15వ వార్షికోత్సవం సాంబయ్య 30 వ వర్ధంతి సందర్భంగా మంగళవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ దేపూరు భారతి కి విద్యాదాత సీహెచ్. సాంబయ్య స్మారక అవార్డుతో సత్కార సభ జరిగింది. సభకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సీహెచ్. భాస్కరరావు అధ్యక్షత వహించారు. అతిధులుగా మాజీ యం.ఎల్.సి. డాక్టర్ ఏ.యస్. రామకృష్ణ, ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (కో-ఆర్డినేషన్) పయ్యావుల పార్వతి, హిందీ పండితులు పారేపల్లి భార్గవరామ్ దుర్గాప్రసాద్, గ్లోబల్ ఆటో మేషన్స్ ప్రొప్రయిటర్ సీహెచ్. చైతన్య తదితరులు పాల్గొని దేపూరు భారతిని సాంబయ్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభలో ఇటీవల వెలువడిన పదోవ తరగతి పరీక్షా ఫలితాలలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిం చిన విద్యార్థిని ఆకుల వెంకట నాగసాయి మనస్వికి 10వేల నగదు పురస్కా రంతో ఆత్మీయ సత్కారం జరిగింది. సభానంతరం నాట్యాచారిణి లేఖ్యాభరణి బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

# రివర్స్ పీఆర్సీ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు కు ఇంక్రిమెంట్ ఇవ్వాలి

గుంటూరు సిటీ, మేజర్‌న్యూస్
రివర్స్ పిఆర్సి పొందిన ఉద్యోగ , ఉపాధ్యాయ , పెన్షనర్లు కు ఇంక్రిమెంట్ ఇవ్వాలి కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇవ్వాలని జిల్లా అధ్యక్షుడు చాంద్బాషా అన్నారు. ఏపీజీఈఏ గుంటూరు జిల్లా కార్యాలయం లో జిల్లా కార్యవర్గ సమావేశంలో లో మాట్లాడుతూ 2020 పి ఆర్ సి లో ఉద్యోగులకు ప్రభుత్వం మోసపూరిత హామీ వలన ఉద్యోగ ,ఉపాధ్యాయ , పెన్షనర్లు అందరూ ఆర్థికంగా నష్టపోయారని, తిరిగి ఆ నష్టాన్ని భర్తీ చేయుటకు కాబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగ లోకానికి ఒక

## ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా

ఇంక్రిమెంట్ ఉద్యోగులకు ఇచ్చి మనోభావాలకు గుర్తించాలని కోరారు. భవిష్యత్తులో ఉద్యోగులకు మంచి పీఆర్సి , ఐ ఆర్, డీఏ మరియు పెండింగ్ బకాయిలను విడుదల చేసి ఉద్యోగులను ప్రాధాన్యత వర్గంగా గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కెవియస్ శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా షాఖాదరి నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెద రత్తయ్య, , నగర కోశాధికారి మువ్వ శ్రీనివాసరావు, జాన్ తదితరులు పాల్గొన్నారు.




## లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



వినుకొండ మేజర్‌న్యూస్
మార్కాపురం రోడ్డులో గల శ్రీ బాలాజీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయము నందు లారీ ఓనర్ల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో లారీ ఓనర్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లారీ ఓనర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా నాగిరెడ్డి రామిరెడ్డి ఎన్నికవ్వగా వైస్ ప్రెసిడెంట్ గా బి వి కోదండ రామయ్య,సెక్రటరీగా వై వెంకటేశ్వర్లు,జాయింట్ సెక్రటరీగా ఎస్ కె షరీఫ్,ట్రెజరర్ గా వీర్రాజు,గౌరవ అధ్యక్షులుగా దొడ్డ అనంతరెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను లారీ ఓనర్స్ సభ్యులు పూలమాలలు, దుశ్యాలువాల తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని లారీ ఓనర్ల సమస్యలపై దృష్టి సారించి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించే దిశగా ముందడుగు వేస్తామని తెలియజేశారు.

## ఎన్నికల గొడవల్లో 41మంది అరెస్ట్ నెల్లూరు జైలుకు తరలింపు

మాచర్ల, మేజర్‌న్యూస్
సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన అల్లర్లకు సంబంధించి వెల్దుర్తి,మాచర్ల మండలాలకు చెందిన 41 మందిని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు మంగళవారం తెలిపారు.వెల్దుర్తి మండలంలోని కొత్తపల్లి రెడ్డి గూడెం గ్రామంలో జరిగిన గొడవల్లో 20 మంది,అదే మండలంలోని గొట్టిపాళ్ళ గ్రామంలో జరిగిన గొడవల్లో 9 మందిని,మాచర్ల మండలంలోని కంభంపాడు గ్రామంలో జరిగిన గొడవల్లో 12 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా వారికి రిమాండ్ విధించి నెల్లూరు జైలుకి తరలించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మిగిలిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని రూరల్ ఎస్సై కే.రాజశేఖర్ తెలిపారు.

## 15 నుండి ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు

గుంటూరు సిటీ, మేజర్‌న్యూస్
నెల 15,16,17 తేదీలలో స్టెప్ రాష్ట్ర కమిటీ ఆద్వర్యంలో తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో జరగనున్న ఉచితంగా పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ నిర్వహిస్తున్నాట్లు స్టెప్ ప్రిన్సిపల్ డాక్టర్. బత్తుల క్రిష్ణయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ పావని మంగళవారం మీడియా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కొరిటెపాడు లోని స్టెప్ కార్యలయంలో ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. నేటి విద్యార్థులలో, ఉపాధ్యాయులలో, తల్లితండ్రులలో ఉన్న శక్తి, సామర్థ్యాలను వెలికి తీయడానికి, వారిలో ఉన్న ఆత్మన్యూనత భావాన్నీ పోగొట్టి, ఆత్మవిస్వాసాన్ని నింపి వారు ఉన్న రంగంలో శక్తి వంతులుగా తీర్చిదిద్ది మంచి సమాజం ఏర్పాటు కోసం ఏర్పాటు కోసం జరుగుతున్న ఈ ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను ప్రతి



ఒక్క విద్యార్థులు వినియోగించుకోవాలని కృష్ణయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మారెడ్డి, శరత్, మల్లికార్జున్, సతీష్ బాబు, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ శిక్షణ మరిన్ని వివరాల కొరకు ఫోన్ - 9666813833 - 7386883244. సంప్రదించ వలసిందిగా కోరారు.

## విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఐక్యం సంస్థ పనిచేస్తుంది

### వ్యవస్థాపకురాలు పద్మ

పొన్నూరు, మేజర్‌న్యూస్
విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడం ద్వారా వారి సంపూర్ణ అభివృద్ధికి ఐక్యం సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు పద్మ, డేవిడ్ లు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ పొన్నూరు వారి ఆధ్వర్యంలో స్థానిక నిడుబ్రోలు పాములపాటి రవీ ంద్రనాథ్ గృహమునందు విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు నందు ఐక్యం సంస్థ వ్యవ స్థాపకులు పద్మ డేవిడ్ లు పాల్గొని ప్రసంగించారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంచటం, నైపుణ్యాలను వెలికి తీయడం ద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని పెంపొందించవచ్చునన్నారు. విద్యార్థులను వారి నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా సమాజంలో వారి నాయకత్వ లక్షణాలను ప్రతిస్పందించవచ్చునన్నారు. ఈ సందర్భంగా నాట్కో స్కూలు




విద్యార్థుల ప్రశ్నలకు వారు సమా ధానాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు సెక్రటరీ బోడపాటి రామారావు ,రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాములపాటి రవీంద్రనాథ్, జిఎంఎస్ గుప్తా, బి. వి చౌదరి, ఎంఎం ఖుద్దుస్, ఎన్ మేఘనాథ్, మహమ్మద్ జిలాని ,కే రామకృష్ణ, తోట భాను ప్రసాద్, జి రాధాకృష్ణ వి రాజేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## నేడు అంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం



గన్నవరం, మేజర్‌న్యూస్
ఈ నెల 12వ తేదీ బుధవారం గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామ పరిధిలోని ఐటీ పార్క్ ప్రాంగణంలో అంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సర్వసన్నద్ధంగా ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా.. కార్యక్రమ ప్రత్యేక అధికారులతో కలిసి చివరి దశలో ఉన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన వేదికపైన చేసిన ఏర్పాట్లతో పాటు ప్రాంగణం సుందరీకరణ, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం, పటిష్ట భద్రత, 36 గ్యాలరీలలో చేసిన ఏర్పాట్లు తదితరాలను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమానికి గౌరవ ప్రధానమంత్రి కూడా హాజరవుతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ట్రిపుల్ ఏ క్యాటగిరీలో ఉన్న ఆరు గ్యాలరీలకు సంబంధించి చేసిన ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెంట అదనపు డీజీపీ ఎస్.బాగ్చి, ప్రత్యేక అధికారులు ప్రద్యుమ్న, బాబు ఏ, వీరపాండ్యన్, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా పోలీసు అధికారి అద్నాన్ నయీం అస్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం



### TSPSC గ్రూప్-1 ప్రిలిమినరీ హాల్ టికెట్లు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ tspsc.gov.in లో అందుబాటులోకి తీసుకు వచ్చింది. అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 9న ప్రిలిమ్స్ పరీక్ష ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగనున్నది. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 వరకు దరఖాస్తులు స్వీకరించింది. గ్రూప్-1 ప్రిలిమ్స్ కోసం దాదాపు 4.03లక్షల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష రోజున ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు కేంద్రాల్లోకి అభ్యర్థుల్ని అనుమతిస్తారు. అక్టోబర్ 21 నుంచి మెయిన్స్ పరీక్షలను నిర్వహిస్తారు.

### జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆన్సర్ 'కీ'

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ప్రొవిజనల్ ఆన్సర్ కీ జూన్ 2న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ మద్రాస్) వెలువరించింది. ఈ పరీక్ష రాసిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి ప్రశ్నపత్రంతో పాటు ప్రొవిజనల్ కీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్ నమోదు చేసి ఈ వివరాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆన్సర్ కీపై అభ్యంతరాలు లేవనెత్తడానికి జూన్ 3 సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చారు. అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం ఫైనల్ ఆన్సర్‌కీ రూపొందించి, ఫలితాలు వెల్లడిస్తారు.

### జూన్ 9వ తేదీన ఫలితాలు...

ఐఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు జూన్ 9వ తేదీన విడుదలవనున్నాయి. ఫలితాల ప్రకటన అనంతరం ఆల్ ఇండియా ర్యాంకులు క్యాటగెరీ వైజ్ వెబ్‌సైట్‌లో



అందుబాటులో ఉంచాతారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 26వ తేదీన ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2 మొత్తం రెండు సెషన్లలో రెండు పేపర్లకు పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల నుంచి 40 వేల మంది రాసి ఉంటారని అంచనా. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీలు, ఎన్ఐటీలలో అడ్మిషన్లు లభిస్తాయి.

### ఆర్జీయూకేటీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

బాసర ఆర్జీయూకేటీలో 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 1 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. బాసరలోని ఆర్జీయూకేటీలో మొత్తం 1500 సీట్లున్నాయి. పదో తరగతిలో విద్యార్థులు సాధించిన జీపీఏ ఆధారంగా ఈ సీట్లు భర్తీచేస్తారు. ఈ ఏడాది దరఖాస్తు విధానాన్ని ఎస్సెస్సీ బోర్డు సర్వర్‌తో అనుసంధానించారు. దీంతో విద్యార్థి హాల్‌టికెట్ నెంబర్, పేరు వంటి వివరాలు నమోదు చేయగానే ఆటోమెటిక్‌గా ఇతర వివరాలు ప్రత్యక్షమవుతాయి.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.450, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.500 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి. వివరాల కోసం www.rgukt.ac. in వెబ్‌సైట్‌ను, 7416305245, 7416058245, 7416929245 హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

### ఏపీ ఐసెట్ ఫలితాలు విడుదల..

ఆంధ్రప్రదేశ్‌లో ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 44,447 మంది విద్యార్థులు ఐసెట్‌కు హాజరయ్యారు. ఇందులో 42,984 మంది అర్హత సాధించారు. 96.71శాతం ఉత్తీర్ణత నమోదైంది.

### డీవైఈఓ కు 1:100 ఎంపిక చేయాలి...

ఏపీలో నిర్వహించిన డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఉద్యోగాలకు నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్ష నుంచి మెయిన్స్‌కు ఒక పోస్టుకు 50 బదులు 100 మందిని ఎంపిక చేయాలని ఏపీపీఎస్సీకు వినతి పత్రం ఇచ్చారు.

### యూజీసీ నెట్ జూన్ 18న

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ యూజీసీ నెట్ జూన్ 2024 పరీక్షను జూన్ 18న నిర్వహిస్తారు. పరీక్షకు 10 రోజుల ముందు అడ్మిట్ కార్డులు విడుదల చేస్తారు. మొత్తం 83 సబ్జెక్టులలో ఈ పరీక్ష నిర్వహించ నున్నారు. ఓఎమ్మార్ ఆధారిత పరీక్ష (పెన్/ పేపర్)ను ఆఫ్‌లైన్ విధానంలో దేశ వ్యాప్తంగా ఒకే రోజు నిర్వహించనున్నారు.

రెండు షిఫ్టుల్లో పరీక్ష ఉంటుంది. 42 సబ్జెక్టులకు ఉదయం సెషన్‌లో పరీక్ష ఉంటుంది. మిగిలిన 41 సబ్జెక్టులకు మధ్యాహ్నం సెషన్‌లో పరీక్ష ఉంటుంది. ఉదయం సెషన్ 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది. కాగా ఏటా ఈ పరీక్షను రెండు సార్లు నిర్వహిస్తుంటారు.

ఓఎమ్మార్ పద్ధతిలో పరీక్ష ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. పేపర్ 2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష మొత్తం 3 గంటల వ్యవధి ఉంటుంది. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ ఉండదు. జూనియర్ రిసెర్చి ఫెలోషిప్ అవార్డు, యూనిరర్సిటీలు, అనుబంధ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, పీహెచ్‌డీ ప్రవేశాలకు యూజీసీ నెట్ సర్టిఫికెట్ ఉపయోగ పడుతుంది.

## భూగోళశాస్త్రం

APPSC, TSPSC
గ్రూప్-1, 2, జె.ఎల్., డి.ఎల్., నెట్, స్లెట్

(10వ పేజీ తరువాయి...)

వివరణ : మహబూబా ఘాట్ - అత్యంత వెడల్పయిన నిర్మల్ గుట్టలలో ఉంది.

దోలిగుట్ట శిఖరం - పాండవుల గుహలు భూపాల పల్లి జిల్లాలో ఉన్నాయి.

లక్ష్మీదేవరపల్లి కొండలు - బూజుగుట్టల్లో సిద్ధిపేట, మెదక్ జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి.

సీతమ్మకొండ - పాడేరు వద్ద చింతపల్లి కొండలలో విశాఖ పట్టణంలో ఉన్నది.

**29. తెలంగాణ రాష్ట్రం ఉనికి ఏ అక్షాంశాల మధ్య ఉన్నది?**

1. 15046। - 18047। ఉత్తర అక్షాంశాలు
2. 14046। -19047। ఉత్తర అక్షాంశాలు
3. 15055। - 19055। ఉత్తర అక్షాంశాలు
4. 13046। - 18047। ఉత్తర అక్షాంశాలు

జవాబు : 03

వివరణ : తెలంగాణ రాష్ట్రం $15^0 55'$-$19^0 55'$ ఉత్తర అక్షాంశాల మధ్య మరియు $77^0 10'$ - $81^0 50'$ తూర్పు రేఖాంశాల మధ్యలో సమద్విబాహు త్రిభుజము ఆకారంలో విస్తరించి ఉన్నది.

**30. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి రోడ్డు మార్గాన్ని ఏ ప్రాంతాల మధ్య నిర్మించడం జరిగింది?**

1. హైదరాబాదు - వాడి  2. హైదరాబాద్ - షోలాపూర్
3. హైదరాబాద్ - గోపాలపురం  4. హైదరాబాద్ - బీదర్

జవాబు : 02

వివరణ : నిజాం రాజ్యంలో చివరి నవాబైన మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ కాలంలో 1868 సం.లో హైదరాబాద్ - షోలాపూర్ మధ్య రాష్ట్రంలో మొట్టమొదటి రోడ్డు మార్గం నిర్మించబడింది.

**31. జాతీయ వరదల నియంత్రణ కార్యక్రమానికి దోహదపడే అంశం ఏది?**

ఎ. బాండుంగ్ కాంటూంగ్
బి. అడవులను పెంపొందించుట  సి. ప్రాజెక్టులను నిర్మించడం

1. ఎ మాత్రమే  2. ఎ మరియు బి
3. ఎ మరియు సి  4. ఎ,బి మరియు సి

జవాబు : 04

వివరణ : 01. బాండుంగ్ కాంటూంగ్ అనగా ఎత్తైన గోడలను నిర్మించడం.

2. చెట్లను పెంచడం వలన చెరువులకు కాలువలకు గండి పడకుండా ఉంటుంది.

3. ప్రాజెక్టులు నిర్మించడం వలన వరదలు గురికాకుండా ఉంటుంది.

**32. కరువుకు గల కారణం కానిది ఏది?**

1. అధిక వర్షపాతం ఉండడం
2. జనాభా పెరుగుదల వలన
3. అధిక భూగర్భ జల వాడకం
4. వర్షపాతం తక్కువ ఉండడం

జవాబు : 01

వివరణ : 1. వర్షాలు అధికంగా కురవడం వలన చెరువులు, నదులు ప్రవహిస్తాయి.

2. జనాభా పెరుగుదల వలన ఆహారపు కొరత ఏర్పడుతుంది.

3. భూగర్భ జలవాడకం వలన నీటి నిల్వలు తగ్గిపోతాయి.

4. వర్షాలు తక్కువ కురవడం ఎల్‌నినో ప్రభావం వలన కరువు ఏర్పడుతుంది.

**33. రింగ్ ఆఫ్ ఫైర్ అని దేనిని పిలుస్తారు?**




1. హిందూ మహాసముద్రం
2. ఫసిఫిక్ మహాసముద్రం
3. అట్లాంటిక్ మహాసముద్రం
4. అరేబియా సముద్రం

జవాబు : 02

వివరణ : ప్రపంచంలో 80% సునామీలు అగ్నిపర్వత విస్ఫోటనాలు, భూకంపాలు, ఫసిఫిక్ మహాసముద్రంలో సంభవించడం వలన రింగ్ ఆఫ్ ఫైర్ అని పిలుస్తారు.

**34. నేపాల్ భూకంప బాధితులకు భారతదేశం అందిస్తున్న సహాయం పేరు ఏమిటి?**

1. ఆపరేషన్ దోస్త్  2. ఆపరేషన్ మదద్
3. ఆపరేషన్ మైత్రి  4. ఆపరేషన్ రెహ్లాత్

జవాబు : 03

వివరణ : 1. ఆపరేషన్ దోస్త్ టర్కి భూకంప బాధితుల కోసం ఏర్పాటు చేసారు.

2.ఆపరేషన్ మదద్ చెన్నై-కేరళ వరద బాధితుల కోసం ఏర్పాటు చేసారు.

3. ఆపరేషన్ మైత్రి నేపాల్ భూకంప బాధితుల కోసం ఏర్పాటు చేసారు.

4. ఆపరేషన్ రెహ్లాత్ ఉత్తరాఖండ్ వరద బాధితుల కోసం

**35. జాతీయ విపత్తు నిర్వహణ దినోత్సవం**

1. మార్చి-23  2. ఆగష్టు-09
3. నవంబర్-11  4. అక్టోబరు-29

జవాబు : 04

వివరణ : 1. మార్చి 23న వాతావరణ దినోత్సవం

2. ఆగష్టు 09న నాగసాకి దినోత్సవం

3. నవంబర్ -11న జాతీయ విద్యా దినోత్సవం

4. అక్టోబరు 29న జాతీయ విపత్తు కుదింపు దినోత్సవం

- పాదం సుధాకర్, ఫ్యాకల్టీ, హైదరాబాద్

## ఎకానమీ

APPSC, TSPSC
గ్రూప్-1, 2, జె.ఎల్., డి.ఎల్., నెట్, స్లెట్

(7వ పేజీ తరువాయి...)

**ప్రభుత్వ వ్యయం పెరుగుట :**

- దేశంలో రక్షణ, శాంతిభద్రత నిర్వహణకు వ్యయం పెరుగుతున్నది. వడ్డీ చెల్లింపులు, అనవసరమైన సబ్సిడీలు ఇవ్వడం ద్వారా లోటు బడ్జెట్ ఏర్పడును.

**లోటు బడ్జెట్ :**

- ప్రభుత్వం తన వ్యయానికి సరిపడే రాబడిని సమకూర్చలేనపుడు బ్యాంకుల ద్వారా ఋణం తీసుకుంటుంది. దీనిని డెఫిసిట్ ఫైనాన్స్ అంటారు. రెండవ ప్రణాళికా కాలంలో 954 కోట్లు ఉండగా 11వ ప్రణాళికా కాలం నాటికి రూ. 185,000 కోట్లకు పెరిగింది.
- జనాభా పెరుగుదల
- ఎగుమతులు పెరుగుట
- ప్రజల వినియోగం పెరుగుదల
- సులభపరమైన ద్రవ్యవిధానం
- ప్రభుత్వం తీసుకున్న ఋణాలు తిరిగి చెల్లించుట
- ద్రవ్య సప్లయి పెరుగుదల

**సప్లయి తగ్గుదలను కలిగించే అంశాలు :**

- సప్లయి వైపు కారకాలు ఉత్పత్తి వ్యయాన్ని పెంచును. వ్యవసాయ అభివృద్ధిలో స్థిరత్వం లేకపోవటం వల్ల ప్రకృతి సహకరించకపోవడం వలన ఆహార ఉత్పత్తి కొరత ద్వారా ఆహారధాన్యాల ధరలు, సాధారణ ధరలు రెండు పెరుగుతున్నవి.

**ఇతర కారణాలు :**

- ప్రకృతి వైపరీత్యాలు
- ఉత్పత్తి కారకాల సప్లయి కొరత
- వ్యాపారస్థులు వస్తువులను దాచివేయుట
- వినియోగదారులు వస్తువులను ముందుగానే కొని నిలవచేయుట.
- వేతన రేట్లు అధికంగా ఉండుట
- అధికంగా పన్ను రేట్లు ఉండుట
- ఉత్పత్తిదారులు అధిక లాభాలను నిర్ణయించుకొనుట
- ఇతర అంతర్జాతీయ అంశాలు
- భారతదేశంలో సప్లయి తక్కువగా ఉండటం, ప్రభుత్వ వ్యయం అధికంగా ఉంటే ఇది అధిక ద్రవ్యోల్బణానికి కారణం.

**ద్రవ్యోల్బణ ప్రభావాలు :**

- వినియోగ వస్తువుల కొరత
- పొదుపు తగ్గుట
- వ్యాపార అనిశ్చిత ఏర్పడుట
- అంచనా వ్యాపారం పెరుగుదల
- ధరల యంత్రాంగం దెబ్బతినుట
- దేశీయ ద్రవ్య విలువ తగ్గుట
- ఉత్పత్తి ద్రవ్యోల్బణ ప్రభావం :
- తక్కువస్థాయిలో పెరిగే ద్రవ్యోల్బణం ఆర్థికాభివృద్ధికి సహాయపడును.

- Dr.M.Reddi Ramu, Associate Proffessor

# సౌదీ అరేబియాలో బ్రహ్మానందరెడ్డి విజయోత్సవ సంబరాలు



మాచర్ల మేజర్‌న్యూస్‌: పౌరుషానికి ప్రతీక అయిన పల్నాడు రక్తం పల్నాడె... అది అమెరికా కానీ అరబ్బు దేశం కానీ ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ పల్నాడును అంటుంది జన్మభూమి పై మమకారం. గల్ఫ్ దేశాలలోని మండుటెండలలో బయటకు వెళ్ళడానికి జంకుతున్న ప్రతికూల పరిస్థుతులలో సైతం పల్నాడు ప్రవాసాంధ్ర తెలుగుదేశం అభిమానులు పార్టీ విజయోత్సవ పండుగను చేసుకొంటూ అస్వాదిస్తున్నారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికలలో మాచర్లలో జరిగిన దౌర్జన్యకాండ తక్కువేమి కాదు, రాష్ట్ర చరిత్రలో సంచలనం సృష్టించిన ఈ ఎన్నికలలో పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్ధిగా 33 వేల అధిక్యతతో విజయం సాధించిన జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎన్నికల పోరు మాతృభూమితో పాటు ఖండంతరాలలోని పల్నాడు ప్రవాసీయులలో కూడ ఎనలేని ఆసక్తి కల్గించగా అనేక మంది విదేశాల నుండి తమ ఉద్యోగాలకు సెలువుపెట్టి మరీ ప్రచారం చేసి వెళ్ళారు. ఎన్నికలలో తమ పల్నాడులో జరిగిన ఆమాయక జనం పై జరిగిన దౌర్జన్యం పై విదేశాలలోని ప్రవాసీయులు కూడ చలించిపోయారు.

ఈ నేపథ్యంలో మాచర్ల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్ధిగా గెలిచిన జూలకంటి బ్రహ్మారెడ్డి విజయోత్సవ సభలను అమెరికాతో పాటు గల్ఫ్ దేశాలలో పార్టీ అభిమానులు ప్రత్యేకంగా జరుపుకోంటున్నారు. సౌదీ అరేబియా రాజధాని రియాధ్ నగరంలో సోమవారం రాత్రి ప్రవాసాంధ్ర ప్రముఖుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు షేక్ జానీ బాషా అధ్వర్యంలో విజయోత్సవ సంబురాలను నిర్వహించగా ఇందులో జనసేన, బిజెపి కూటమి అభిమానులు కూడ పాల్గోన్నారు. మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, నర్సరావుపేటతో పాటు పెనమలూరు, దర్శి, అద్దంకి నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం అభిమానులకు జానీ బాషా విందు ఇచ్చారు.

ఈ సందర్భంగా జానీబాషా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కూటమిలో బిజెపి చేరడం పట్ల అనేక మంది ముస్లింలు తమను ప్రశ్నించారని కానీ చంద్రబాబు నాయుడు పట్ల ఉన్న సంపూర్ణ విశ్వాసంతో పల్నాడులోని ప్రతి ఒక్కరు కులమతాలకు అతీతంగా తెలుగుదేశాన్ని సమర్ధించారని పెర్కోన్నారు. ఇప్పటి వరకు మాచర్ల నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, వరికలపూడిసెల ప్రాజెక్టు గత దశబ్దాల నుండి కలగా మిగిలి పోయిందని గుర్తుచేసుకున్నారు. నారా చంద్ర బాబు మాచర్ల యందు ప్రత్యేక దృష్టి పెట్టి జూలకంటి బ్రహ్మానంద రెడ్డికి మంత్రివర్గంలో ప్రత్యేక హెూదా కలగజేస్తారని భావిస్తున్నానని జానీబాషా షేక్, యెంపరాల శ్రీనివాస రెడ్డి తెలియజేశారు.

# ప్రజలకు కోసం ప్రత్యక్ష ప్రసారం ఎమ్మెల్యే అరవింద్‌బాబు







నరసరావుపేట మేజర్‌న్యూస్: పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో భువన చంద్ర టౌన్ హాల్‌లో చంద్రబాబు ప్రమాణస్వీకార ప్రత్యక్ష ప్రసారాన్ని చేస్తున్నామని ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే అరవింద బాబు, అధికారులు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నరసరావుపేట ప్రజలు లైవ్‌లో వీక్షించేందుకు నరసరావుపేట ఎమ్మెల్యే డా॥చదలవాడ అరవింద బాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నరసరావుపేట పట్టణంలోని టౌన్ హాల్‌లో చేసిన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఐదేళ్లు కష్టాలు అనుభవించిన ప్రజలు రేపటి నుండి ప్రజా పాలనలో భాగస్వాములు కాబోతున్నారన్నారు. దగాపడ్డ ప్రతి కార్యకర్త,ప్రతి పౌరుడూ ఇక నుండి ప్రజల కోసం నడిచే వ్యవస్థల్ని చూడబోతున్నారని తెలిపారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి రాలేకపోయిన ప్రతి ఒక్కరూ ఇక్కడి నుండే కార్యక్రమాన్ని వీక్షించవచ్చునని తెలిపారు. ప్రజల ఆకాంక్ష, ప్రజల కోరిక అయినటువంటి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాట్లు చేయడం సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే డా॥చదలవాడ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి విజయ్‌కుమార్, మాబు, బడే బాబు, బాలు, మునిసి పల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నాలుగో వార్డులో టీడీపీ నేతల ప్రత్యేక ప్రార్ధనలు



నరసరావుపేట మేజర్‌న్యూస్: నరసరావుపేట నియోజకవర్గంలో పసుపు జెండా ఎగరేయడంపై నేతలు, కార్యకర్తల హర్షం తెలిపారు. నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తానని ఎమ్మెల్యే డా॥చదలవాడ అన్నారు. నరసరావుపేటలో తెలుగుదేశంపార్టీ గెలుపు పై నేతలు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని నాలుగో వార్డులోని జెండా చెట్టు వద్ద మున్సిపాలిటీ మాజీ వైస్‌ఛైర్మన్ మీరావలి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. దశాబ్దాలుగా నియోజకవర్గాన్ని ఏలుతున్న నియంతలను ఓడించి అరవిందబాబును గెలిపించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని మీరావలి పేర్కొన్నారు. ఎమ్మెల్యే డా॥చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని మోడల్ నియోజకర్గంగా అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు.ఎన్నికల్లో గెలుపు కోసం వైసీపీ నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా, కుట్రలు చేసినా.. పార్టీ కార్యకర్తలు అండగా నిలిచారన్నారు. వారి కష్టాన్ని,శ్రమను వృధా కానివ్వనని ఎమ్మెల్యే డా॥చదలవాడ అరవింద బాబు హామీ ఇచ్చారు.

# ప్రత్తిపాటి పుల్లారావును మర్యాదపూర్వకంగా కలిసిన అరవిందబాబు

నరసరావుపేట మేజర్‌న్యూస్: చిలకలూరిపేట ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు ప్రత్తిపాటి పుల్లారావును నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం దుశ్వాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రంలో ఐదేళ్ల అరాచకానికి శుభం కార్డు వేశామని,రాష్ట్ర అభివృద్ధి కోసం అంతా కలిసి పని చేయనుండడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో సవాళ్లు,అవమానాలు ఎదురైనా వెనుదిరుగకపోరాడి గెలిచిన ప్రతి కార్యకర్తకూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కపిలవాయ విజయ్ కుమార్,గొట్టిపాటి జనార్దన్ బాబు పాల్గొన్నారు.



# సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం... ట్రాఫిక్ మళ్లింపు




గుంటూరు క్రైం, మేజర్‌న్యూస్: ఈనెల 12వ తేదీ బుధవారం విజయవాడ కేసరపల్లి ఐటీ పార్కు వద్ద ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా ట్రాఫిక్ మళ్ళీ ఇస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించుటకు గాను గుంటూరు నగరం నుండి విజయవాడ వెళ్ళు ట్రాఫిక్‌ను ఈ క్రింద సూచించిన విధంగా మళ్లింపు చేయడం జరిగిందని గుంటూరు జిల్లా ఎస్పీ తెలిపారు. బుడంపాడు జంక్షన్ గుంటూరు నుంచి విశాఖపట్నం వైపు వెళ్ళు వాహనాలు బుడంపాడు జంక్షన్ వద్ద హైవే దిగి తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జ్, అవనిగడ్డ, పామూరు – గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లవలెను. చెన్నై నుండి వైజాగ్ వెళ్ళు వాహనాలు బుడంపాడు- తెనాలి -వేమూరు - వెల్లటూరు - పెనుమూడి-అవినిగడ్డ- పామర్రు-గుడివాడ - హనుమాన్ జంక్షన్ మీదుగా వైజాగ్ వెళ్ళవలెను. చెన్నై వైపు నుండి బాపట్ల చీరాల వైపు వెళ్ళు అన్ని వాహనాలు గుంటూరు ఏటుకూరు అండర్ పాస్ కింద నుండి పత్తిపాడు- పర్చూరు- చీరాల - బాపట్ల నుండి 216 నేషనల్ హైవే మీదుగా వెళ్ళవలెను. గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్ళు వాహనాలు ను పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లవలెను. విజయవాడ వైపు అనుమతించబడవు. చెన్నై నుండి హైదరాబాద్ వెళ్లేవాహనాలు మేదరమెట్ల-అద్దంకి- పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్ళవలెను. గుంటూరు నుండి విజయవాడ వైపు ఎటువంటి వాహనంలు అనుమతించబడవు. అత్యవసర వాహనాలను ఏ దారి నుంచి అయినా అనుమతించబడును. ట్రాఫిక్ ఆంక్షలు నేపథ్యంలో పోలీసు వారికి సహకరించాలని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఈ సందర్భంగా కోరారు.